క్లుప్తంగా...

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న మెట్టు వెంకన్న

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 7వ డివిజన్‌కు చెందిన ఎండీ.ఖాజీబీ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి వెంటనే స్పందించిన డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు మెట్టు వెంకన్న బాధిత కుటుంబానికి మంగళవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అంబాజీ, భిక్షపతి, దామోదర్‌రెడ్డి, మాల కొండయ్య, రాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డిని సస్పెండ్ చేసిన కాంగ్రెస్



పులకంటి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ చౌదరిగూడ

ఘట్‌కేసర్: చౌదరిగూడ ఎంపీటీసీ పులకంటి భాస్కర్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి మంగళవారం సస్పెండ్ చేసింది. ఈ మేరకు చౌదరిగూడ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్ ఉత్తర్వు జారీ చేశాడు. భాస్కర్‌రెడ్డి కొన్ని రోజులుగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నట్లు, పార్టీ అధిష్టానం మేరకు ఎంపీటీసీని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. చౌదరిగూడలోని వెంకటాద్రి టౌన్‌షిప్ వద్ద మంత్రి మల్లారెడ్డి సమక్షంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి బుధవారం బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు సమాచారం.

సోషల్ మీడియాలో ప్రచారం చేసినా కేసులే..



ఎన్నికల సహాయ అధికారి శైలజ

మేడ్చల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పార్టీల కోసం, అభ్యర్థుల కోసం సోషల్ మీడియా వేదికలు వాట్సాప్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి వాటి ద్వారా అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని మేడ్చల్ నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి, మేడ్చల్ తహసీల్దార్ శైలజ తెలిపారు. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న గ్రూపులలో పార్టీల కోసం, నాయకుల కోసం ప్రచారం చేస్తే అడ్మిన్స్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులు లేకుండా ఎలాంటి ప్రచారాలు చేసినా కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని, నియమావళి ప్రకారం అందరూ నడుచుకోవాలని సూచించారు. గోడలపై రాతలు రాయాలన్నా, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నా, జెండాలు కట్టాలన్నా.. పార్టీలకు చెందిన నాయకులు తప్పనిసరిగా అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని, వాటి ఖర్చులు పార్టీల ఖాతాలో చేర్చి సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

13న చర్లపల్లి జైల్‌లో ఇనుప తుక్కు వేలం

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఈ నెల 13న ఇనుప తుక్కు వేలం పాట నిర్వహించనున్నట్లు జైల్ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 32,706 కిలోల స్క్రాప్ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 13న ఉదయం 10:30 గంటలకు జైల్ ఆవరణలో జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.25 వేల ధరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

మహిళల దుస్తుల కలెక్షన్ త్యోహార్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ మహిళా దుస్తుల ఎత్నిక్ వేర్ బ్రాండ్ సోచ్.. పండగ కలెక్షన్‌ను త్యోహార్ పేరిట సిటీ మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బాందాని, కలంకారి, బ్యూరెక్స్.. వగైరా సంప్రదాయ, ఆధునిక వస్త్రాల కలయికలో షరారాస్, కఫ్తాన్స్, చుడీదార్ సెట్స్, గౌన్స్.. తదితర దుస్తులు నగరంలోని తమ అన్ని షోరూమ్స్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు.

కాంగ్రెస్ వైపు.. తండ్రీ కొడుకుల చూపు?





సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డికి కాంగ్రెస్ వల

- మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్?
- కుమారుడు బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్?
- మేడ్చల్ కాంగ్రెస్‌లో ఊహకందని పరిణామాలు

మేడ్చల్: త్వరలో జరిగే ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌ను ఢీకొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గంలో జోరుగా పావులు కదుపుతోంది. కాంగ్రెస్ పార్టీలో బలమైన నాయకులు టికెట్ ఆశిస్తున్నా బీఆర్ఎస్ ఓట్లకు గండికొట్టే నాయకులను తమ పార్టీలో చేర్చుకునేందుకు మంతనాలు జోరుగా సాగిస్తోంది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమీప బంధువు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఆయన కుమారుడు మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డిలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు నాయకులు జోరుగా లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం.

ఐదేళ్లుగా పచ్చగడ్డి వేస్తే భగ్గు..

సుధీర్‌రెడ్డి మేడ్చల్‌కు 2014 నుంచి 2019 వరకు బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యే. 2019లో ఆ పార్టీ అధిష్టానం ఆయన్ను కాదని ఆ సమయంలో ఎంపీగా ఉన్న మంత్రి మల్లారెడ్డిని మేడ్చల్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీలోకి దింపగా ఆయన గెలిచి ఏకంగా మంత్రి అయ్యారు. మల్లారెడ్డి లక్ష్మీపుత్రుడు కావడం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు దగ్గరగా మారడంతో ఆయన బీఆర్ఎస్‌లో తిరుగులేని నాయకుడిగా మారాడు. దీంతో ఐదేళ్ల నుంచి మల్లారెడ్డికి, సుధీర్‌రెడ్డికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. బహిరంగంగానే ఒకరినొకరు విమర్శించుకున్నారు. అసమ్మతితో రగులుతున్న సుధీర్‌రెడ్డిని శాంతింపజేసేందుకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి నాడు రంగంలోకి దిగి ఆయనకు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి, ఆయన కుమారుడు శరత్ చంద్రారెడ్డికి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి వచ్చేలా కృషి చేశారు.

సమయం కోసం ఎదురుచూస్తున్న ఆయనకు..

బీఆర్ఎస్‌లో ఎన్నాళ్లు ఉన్నా తాను తిరిగి ఎమ్మెల్యే కాలేనని, మంత్రి మల్లారెడ్డిని కాదని నియోజకవర్గంలో ఎదగలేనని భావిస్తున్న సుధీర్‌రెడ్డి ఎన్నో ఏళ్లుగా అసంతృప్తితోనే ఉన్నారు. రేవంత్‌రెడ్డి సమీప బంధువు కావడం, సమయం కోసం ఎదురుచూస్తున్న ఆయనకు తాజాగా కాంగ్రెస్ నాయకులు గాలం వేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఇస్తే పార్టీలోకి వస్తానని ఆయన తేల్చిచెప్పినట్లు సమాచారం. ఇప్పటికే నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కోసం హరివర్ధన్‌రెడ్డి, జంగయ్యయాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్ పోటీ పడుతుండగా తనకు టికెట్ ఎలా ఇస్తారని, తనకు టికెట్ ఇస్తే గెలిచి చూపుతానని లెక్కలు చూపుతున్నట్లు సమాచారం. తాను పోటీలో ఉంటే కాంగ్రెస్ ఓట్లతో పాటు, రెడ్డి సామాజిక వర్గం ఓట్లు, బీఆర్ఎస్ ఓట్లు వస్తాయని మిగతా వారికి ఆ అవకాశం లేదని ఆయన లెక్కలు చూపుతున్నారని నాయకులు చెబుతున్నారు.

బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగిలే అవకాశం..

టికెట్ ఆశిస్తున్న హరివర్ధన్‌రెడ్డికి రాబోయే కాలంలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి, నక్క ప్రభాకర్‌గౌడ్‌కు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి, జంగయ్యయాదవ్‌కు పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి, ఆయన కుమారుడికి బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ పదవి ఇస్తామని నచ్చజెప్పి అందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి సుధీర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని టీపీసీసీ స్థాయిలో నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. సుధీర్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటే మేడ్చల్‌లో బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉందని అధికార పార్టీ మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరితే స్థబ్దుగా ఉన్న ఓట్లను తమ బ్యాలెట్‌కు రప్పించుకునే సానుకూల వాతావరణం ఏర్పడుతుందని కాంగ్రెస్ నాయకుల అంచనా. ఎన్నికలకు తేదీ దగ్గరపడుతుండటంతో మేడ్చల్ కాంగ్రెస్‌లో ఊహకందని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

3,560 పోస్టర్లు, బ్యానర్లు, వాల్‌రైటింగ్ తొలగింపు



మేడ్చల్‌లో గోడలపై రాతలను తొలగిస్తున్న సిబ్బంది



మేడ్చల్‌లో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో ప్రభుత్వ స్థలాల్లోని 97 చోట్ల 1,658 పోస్టర్లు, 1,659 బ్యానర్లు, 146 వాల్ రైటింగ్‌లను తొలగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడిన 24 గంటలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అనుసరించి వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.

మార్పులకు అనుగుణంగా పరిశోధనలు జరగాలి



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి కళాకుమార్

- ఇండియన్ ఫార్మకాలజీ సొసైటీ ప్రధాన కార్యదర్శి కళాకుమార్

ఘట్‌కేసర్: వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని ఇండియన్ ఫార్మకాలజీ సొసైటీ ప్రధాన కార్యదర్శి కళాకుమార్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో మంగళవారం నిర్వహించిన ఫార్మసీ అధ్యాపకుల డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీని ఫార్మకాలజీకి అనుసంధానం చేయడం ద్వారా వినూత్న ఆవిష్కరణలకు తోడ్పడుతుందని అన్నారు. ఫార్మసీ డీన్ వసుధ భక్షి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ సహకారంతో కొత్త ఔషధాలను సృష్టించి సామాన్యులకు తక్కువ ధరలో మందులు అందించవచ్చని, డ్రగ్ రెసిస్టన్స్ వంటి సవాళ్లను కృత్రిమ మేధస్సుతో ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బాలాజీ, ప్రోగ్రామ్ కో కన్వీనర్లు కృష్ణప్రసాద్, సునంద్, ఫార్మా కాలేజీ అధ్యాపకులు సయ్యద్, నవీన్, ఫరానా, మౌనిక, రాముడు, ఫాతిమా, విద్యార్థులు శ్రీజ, ధరణి, అఖిల పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్‌లో ఫొటోగ్రఫీ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థులతో కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమలో దాగిఉన్న నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వర్క్‌షాప్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. ఫొటోగ్రఫీపై మక్కువ ఉన్న విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీరేంద్ర అధికారి సింగ్ పాల్గొని విద్యార్థులకు ఫొటోగ్రఫీపై శిక్షణ, పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు తమ కళాశాలలో తరచూ వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతినెలా కాలేజీలో ప్రకృతికి సంబంధించి, అందమైన ఫొటోలు తీసి ప్రదర్శించి ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఏవో హరిప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పోచారం: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలో అక్రమంగా మద్యం అమ్ముతున్న నానావత్ అశోక్(33)ను పోలీసులు అదుపులోకి తీసుకొని, అతడి దగ్గరున్న 36 ఆఫీసర్స్ చాయిస్ క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దసరా వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



గురుకుల్ క్రీడా మైదానాన్ని చదును చేయిస్తున్న జన చైతన్య సేవా సమితి సభ్యులు

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ క్రీడా మైదానంలో జన చైతన్య సేవా సమితి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిఏటా నిర్వహించనున్న దసరా వేడుకలకు మంగళవారం ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డోజర్‌తో మైదానాన్ని చదును చేయించారు. దసరా వేడుకలను గతంలో మాదిరిగా బతుకమ్మ ఉత్సవాలు, రావణ దహనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జన చైతన్య సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి శివరాత్రి సురేశ్, పొన్నయ్యయాదవ్, రాంమోహన్, వంశీ, విక్రాంత్‌రెడ్డి, శివప్రదీప్‌రెడ్డి, పవన్‌యాదవ్, చందుయాదవ్, జి.సురేశ్, భానుయాదవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేటినుంచి స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో

ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో బుధవారం నుంచి 14 రోజుల పాటు స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ ప్రారంభించనున్నారు. మంగళవారం ఉప్పల్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనరల్ మేనేజర్ అంజయ్య మాట్లాడుతూ చేనేత, హస్తకళలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా, చేతి వృత్తిదారులకు ప్రోత్సాహం కల్పించే విధంగా ప్రదర్శన ఉంటుందన్నారు. 120 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారత దేశ సాంప్రదాయం ఉట్టిపడేలా దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శనలో ఉత్పత్తులు ఉంచనున్నట్లు తెలిపారు.

శుభాకాంక్షలు

అల్వాల్: అల్వాల్‌కు చెందిన మాజీ గ్రేటర్ కో-ఆప్షన్ సభ్యురాలు గొట్టిముక్కల జ్యోతి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా మంగళవారం మంత్రి కేటీఆర్‌ఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జ్యోతిగౌడ్‌కు మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేయాలి

వాల్ రైటింగ్, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్లు తొలగించాలి

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదు
- వెబ్‌సైట్లలో రాజకీయ నాయకుల ఫొటోలు తీసివేయాలి
- ప్రభుత్వ వాహనాలను రాజకీయ అవరాలకు వాడొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున.. తప్పకుండా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్లు తదితరాలన్నీ 24 గంటలలోపు, అన్ని పబ్లిక్ స్థలాల్లో ఉన్న వాటిని 48 గంటల్లో, ప్రైవేట్లో ఉన్న వాటిని 72 గంటలలోపు తొలగించాలని ఆయన ఆదేశించారు. వెబ్‌సైట్లలో రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని, ప్రభుత్వ వాహనాలను రాజకీయ అవసరాల కోసం వాడరాదని సూచించారు. ప్రభుత్వ అతిథి గృహాలు, హెలీప్యాడ్, ప్రభుత్వ మైదానాలను ఫస్ట్ కమ్ ఫస్ట్‌కి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి వీల్లేదని, ప్రగతిలో ఉన్న పనులు మాత్రమే చేపట్టాలని కలెక్టర్ అమయ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రగతిలో ఉన్న, ఇంకా ప్రారంభం కాని కొత్త పనుల జాబితా తమకు సమర్పించాలని కలెక్టర్ కోరారు. కొత్త పనులు చేపట్టడం, ప్రకటించటం వంటివి చేయరాదని పేర్కొన్నారు. సీ- విజిల్ పర్యవేక్షణ చేయాలని, టోల్‌ఫ్రీ నంబర్తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యా సంస్థలు, విద్యార్థులు, యువతకు సీ- విజిల్ యాప్‌పై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమని, ఏ దశలోనూ అలసత్వం వహించరాదని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలన్నారు. స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

వచ్చే నెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ

శాసనసభ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుందని, 13న స్క్రూటినీ నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 15 వరకు ఉంటుందన్నారు. నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 171(బి) ప్రకారం డబ్బులు ఇవ్వడం, తీసుకోవడం నేరమన్నారు. 171 (సి) ప్రకారం ఓటర్లను బెదిరించడం నేరమని తెలిపారు. సెక్షన్ 171(ఏ) ప్రకారం ప్రచార పోస్టర్లు, కరపత్రాలు ముద్రించే ప్రింటింగ్ సంస్థలు తప్పకుండా వాటిపై ప్రింటర్ పేరు, పబ్లిషర్ పేరు, మొబైల్ నెంబర్లను విధిగా ప్రచురించాలని అలా చేయనట్లయితే బాధ్యులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు.

ఓటర్లు 26.91 లక్షలు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఓటర్లు 26,91,167 మంది ఉన్నారని కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. ఇందుకుగానూ 2,397 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పురుషులు 13,95,033, మహిళా ఓటర్లు 12,95,773 మంది, ట్రాన్స్‌జండర్లు 361 మంది ఉండగా, మొత్తం ఓటర్ల సంఖ్య 26,91,167 మంది ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు.

మూడోసారి బీఆర్ఎస్‌కు అధికారం ఖాయం



మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజల ఆశీస్సులతో ముచ్చట మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మారుతిగార్డెన్‌లో నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేసినట్లు చెప్పారు. ఒక్క నాగారం మున్సిపాలిటీలో ఇప్పటి వరకు సుమారు రూ.85 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాంపల్లి 1వ వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్ ఉన్నా సుమారు రూ.3.6 కోట్ల మేర మున్సిపల్ నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గమనించాలన్నారు. రాంపల్లిలో స్థానికులకు 10 శాతం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం తామే కోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చామని, స్థానికంగా ఉన్న రాంపల్లి పేదలకు 6,500 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 10 శాతం ఇళ్లు ఇప్పించేంత వరకు పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ మాట్లాడుతూ 70 ఏళ్ల వయసున్న మంత్రి మల్లారెడ్డిపై విమర్శలు చేసే సమయంలో కాంగ్రెస్ నేతలు తమస్థాయిని దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, దివ్యదయాకర్‌రావు, మోకు రేణుకజగన్మోహన్‌రెడ్డి, సుర్వీ శ్రీనివాస్, కౌకుట్ల మమతకృష్ణారెడ్డి, అనితాసుధాకర్‌రెడ్డి, నాగేష్‌గౌడ్, కళావతి, నేతలు గండి అంజయ్యగౌడ్, యాదగిరి, కాంసాని మల్లారెడ్డి, పెంటయ్యగౌడ్, షఫీ, సాయినాథ్‌గౌడ్, రమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ డీఎంహెచ్ఓగా డాక్టర్ రఘునాథస్వామి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్ఓగా డాక్టర్ రఘునాథస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ రఘునాథస్వామిని జిల్లాలోని డిప్యూటీ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సిబ్బంది, రిపోర్టింగ్ సూపర్‌వైజర్లు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మద్యం, డబ్బు పంపకాలపై ప్రత్యేక దృష్టి

- ఉప్పల్ రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్యా



ఉప్పల్: ఎన్నికల్లో మద్యం, డబ్బుపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా ఈ సారి అలాంటి వాటికి చోటివ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉప్పల్ రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్యా తెలిపారు. మద్యం, డబ్బు పంపిణీపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెండు దఫాలుగా ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక తరగతులు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ర్యాంప్‌ల ఏర్పాటు, వీల్ చైర్లు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో 17 మంది నోడల్ అధికారులు, 39 మంది సెక్టార్ అధికారులు, నిరంతరం అభ్యర్థులను వెంటాడే స్టాటికల్ సర్వేలైన్స్ టీం, వీడియో సర్వేలైన్స్ టీంలు నిరంతరం గస్తీ తిరుగుతాయన్నారు. ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ప్రత్యేక ఫోన్ నంబర్‌ను కేటాయించనున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజవర్గ పరిధిలో 409 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటరు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసుకునే అవకాశం

80 ఏళ్ల పైబడి పోలింగ్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉండే వారికి ఈ సారి ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఓటుహక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

అల్వాల్: రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం రాత్రి అల్వాల్‌లోని పంజాబీ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 6 గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అల్వాల్ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, నాయకులు కృష్ణగౌడ్, బాలపీర్, సంతోష్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ప్రకారం వ్యవహరించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎలక్షన్ కోడ్) ఉల్లంఘించకుండా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నియమావళి అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. జిల్లాలో ప్రత్యేక ఎన్నికల ప్రవర్తన, నియమావళిని అమలు పరిచే బృందం ఎల్లప్పుడూ పర్యటిస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. సీ-విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల వారు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. శాసనసభ ఎన్నికలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ పార్టీల జిల్లా నాయకులు పాల్గొన్నారు.